


# మార్చబిళ్ళ

ఆకెళ్ళ వెంకటసూర్యనారాయణ

పోలిగాడు రెప్ప వేయకుండా అటే చూస్తున్నాడు. పోలిగాడే కాదు, ఆ సెంటర్‌లో ఉన్న చాలామంది అటే చూస్తున్నారు.

కిళ్ళీబడ్డీ సిమ్హాద్రి, సారా కొట్టు సాంబయ్య, సిగరెట్ కాల్చుకుంటున్న కాలేజీ కుర్రాడు, రక్షరేకులు కట్టే ఫకీరయ్య, బస్‌కోసం నిలబడిన జనం-అంతాచూస్తున్నారు. చూస్తున్నారంతే!

చీనయ్య గిలగిలా కొట్టుకుంటున్నాడు. నడిరోడ్డుమీద కాళ్ళు, చేతులు కొట్టుకుపోతున్నాయి. చీనయ్య నోట్లోంచి చొంగ కారుతోంది.

కుళాయిదగ్గర నీళ్ళు పట్టుకుంటున్న పుణుకుల పార్వతమ్మ చూసింది.

“చీనయ్యగాడులా ఉందే” అనుకుంటూ మూగి ఉన్న జనాన్ని నెట్టుకుంటూ వచ్చింది.

పదునాలుగేళ్ళ చీనయ్య ఒంటి మీదనో కాకి నిక్కరు, పై నొక దుమ్ము కొట్టుకున్న గళ్ళ చొక్కా ఉన్నాయి. వాడికి కొద్ది దూరంలో అన్నం పొట్లం మట్టిలో పొర్లు తోంది.

"అప్పను చీనయ్యే... మూర్ఛ రోగి!" జనాంతికంగా అంది పార్వతమ్మ.

ఆ తర్వాత అక్కడే నిలబడి పోలేదు. కుళాయి దగ్గరకెళ్ళి కడ వతో నీళ్ళు తెచ్చింది. బొక్కబోర్లా పడి ఉన్న చీనయ్యను వెల్లకితలా తిప్పింది. చీనయ్య మీద పోసింది.

ఇప్పుడు పూర్తిగా కనపడు తోంది- చీనయ్య గుండెల మీదున్న ఇత్తడి బిళ్ళ. దానిమీద ఏవో అక్ష రాలున్నాయి.

ఒకళ్ళిద్దరు ఒంగిచూశారు.

'విత్తనాల చీనయ్య మూర్ఛరోగి. అతనికి తల్లీ దండ్రీలేరు. ఒక చెల్లెలు మాత్రం ఉంది. ఆమెపేరు మంగి. ఇతను తరుచు మూర్ఛ రోగంతో పడిపోతూ ఉంటాడు. పడిపోయిన వెంటనే పది బిందెలు నీళ్ళు పోయవలెను. పావుగంటలో తెలివిరావచ్చు. వచ్చిన తర్వాత కాఫీ కాని, 'టీ' కాని ఇవ్వవచ్చును.

కొమరగిరి వెంకయ్య
తాడేపల్లిగూడెం.'

పార్వతి రెండో కడవతో నీళ్ళు తెచ్చి పోస్తూ "ఏంటే- అలా సోద్యం సూస్తారు. మళ్ళా పట్టుకో వచ్చు. వెళ్ళి పోసి రండి. పుణ్యమే కాని పాపంరాదు." మిగిలినవాళ్ళని హెచ్చరించింది.

కుళాయి దగ్గరున్న ఆడవాళ్ళలో మరో ముగ్గురు నడుం కట్టేరు.

ఇదంతా చూస్తూ గంగరావి చెట్టుదగ్గర నిలబడ్డాడు పోలిగాడు.

పోలిగాడికి పదునాలుగేళ్ళే. పోలిగాడికి అమ్మా, నాన్నలేరు.

చీనయ్యకు, పోలిగాడికీ మొదటి పరిచయం నూకాలుతల్లి గుడివగ్గర.

చీనయ్య, చెల్లెలు మంగి గుడి దగ్గర తలదాచుకుంది కొచ్చేరా పొద్దు! ఆకాశం ఏకధారగా ఏడు స్తోంది. ఎటునించిఎటుపోతున్నారో, అన్నా. చెల్లెలు అక్కడ ఆగేరు.

వర్షం ఎంతసేపటికీ తగ్గలేదు.

సాధువులు, బిచ్చగాళ్ళు, పని లేనివాళ్ళు చాలామంది విశాలమైన అరుగుల మీద సర్దుకుని ఎంత కాలం నించో ఉంటున్నారు,

అప్పటికే వర్షంలో తడిసిన అన్న, చెల్లెలు వణుకుతూ అరగంట గడిపేరు.

మూలగా పొడిజాగాలో కూర్చుని నానురొట్టి నముల్తూ యువ రాజులా కూర్చుని పోలిగాడు వాళ్ళ

కేసే చూస్తున్నాడు.

ఇంతలో ఎక్కడినించో వచ్చేడు గడ్డం భైరవయ్య.

"సల్లగా.... జాగాలో సేరి పోయేరా...ఎళ్ళండి! ఎళ్ళండి" కసిరేశాడు.

అక్కడా అరుగులమీద కొందరి విలాసాలు పోస్టు మేన్‌కి కూడా తెలుసు. అన్నేళ్ళుగా పాతుకు పోయేరు వాళ్ళు.

గజ గజా వణుకుతున్న చినయ్య, మంగి అరుగుమీద మరో మూలకు చేరబోయేరు.

"హేయ్! ఇటు రాకండి!"

"అరి సీయవ్వా ఇటువత్తావేం?"

"పొండి, పొండి!"

అంతా కసిరి పారేశారు.

దిక్కుతోచని చినయ్య, మంగి అరుగుదిగి వర్షంలో నిలబడ్డారు.

పదినిమిషాలు... పావుగంట... అరగంట గడిసిన తర్వాత ఉండబట్టలేక పోలిగాడే పిలిచేడు.

"ఇట్టా పైకిరండి!"

"అళ్ళు తడిసిపోయి వున్నారా...అరుగంతా తడిపేత్తారు" హెచ్చరించేడు గడ్డం భైరవయ్య

అతనే అరుగులకు పెద్దదిక్కు.

"సలిలో సిక్కడి పోయినారు గదా... దగ్గర్లో మరేం లేదు తల కాసుకుందికి!" అన్నాడు పోలిగాడు.

"ఏటికోయ్ అంతేసి జాలి!" పక్కనున్న సాధువు అన్నాడు.

"వల్లకుండండి! నీ కాడికి మొన్న భంగుతాగే సన్నాసయ్యా రానేదా? ఆడు నా సుట్టం అని బుకాయించేవు. ఈళ్ళు నాసుట్టాలు ....వల్లకుండు!" కసిరి పారేశాడు పోలిగాడు.

ఈ గొడవంతా చూస్తూ నిలబడ్డారు వాళ్ళిద్దరు.

"ఇట్టా పైకి రండి!" ఆతిథ్యమిచ్చేడు పోలిగాడు సగం నానుడు రొట్టె ఇచ్చేడు, తల తుడుచుకుందుకి తువ్వాలు ముక్క ఇచ్చేడు. తన జాగాలోనే ముగ్గురూ ముడుచుకుని పడుకునే ఏర్పాటుచేశాడు.

ఆ రకంగా వాళ్ళిద్దరికీ దోస్తీ కుదిరిపోయింది. కష్టాలు, కన్నీళ్ళు కలబోసుకున్నారు. ఆ అరుగుమీద వాళ్ళు మకాం నెమ్మదిగా సంపాదించుకున్నారు.

తాడేపల్లిగూడెంనించి నన్నుంటే అనకాపల్లిలో రైలు దింపేసేరని, తనుకంటూ ఎవరూలేరని బిచ్చమెత్తుకుంటూ బ్రతుకుతున్నానని చెప్పుకున్నారు వాళ్ళు.

"నాకథా అంతే....నాన్న రైలు పట్టాలక్రింద పచ్చడయి పోనాడు. అమ్మ నాను పుట్టిన ఎంటనే కన్ను మూసేసింది. నా బతుకు రోడ్డు

పట్టేసింది." చెప్పుకున్నాడు పోలిగాడు.

ఇద్దరిదీ ఒకటే స్థితి. ఒకటే వృత్తి. పాలు నీళ్ళలాగా కలిపిపోయేరు.

అయితే పోలిగాడికి కొద్ది రోజుల్లో తెలిసిపోయింది- పాలు పాలేనని, నీళ్ళు నీళ్ళేనని.

దానికి కారణం చీనయ్యమెళ్ళో మూర్ఛబిళ్ళ.

మామూలుగా.... అడుక్కోవటంలో ఆరితేలిన పోలిగాడు సంపాదన బాగానే ఉన్నప్పటికీ.... ఎంత చేసినా చీనయ్య వారంలో ఒక్కసారి సంపాదించినంత ఉండటం లేదు.

పోలిగాడి దినసరి ఆదాయం హెచ్చే. అయితేనేం? చీనయ్య వారానికోసారి.... నడిబజార్లో విరుచుకు పడిపోయేడా.... పది కడవల నీళ్ళ వర్షంతోపాటు.... చిల్లరవర్షం.

దాంతో పోలిగాడికంటే చీనయ్య ఆదాయమే హెచ్చు కావచ్చింది.

"చీనయ్యా నీ బిళ్ళ మహత్యం ఇప్పుడర్థం అవుతోందిరా! .... నీ శక్తి అంతా ఈ బిళ్ళలో ఉందిరా.... అవును వారానికో పాలి పడతావేంటిరా?.... సెంటర్ మార్చి రోజుకో సుట్టు పడిపోతే.... సాలు అంతా డబ్బే" నవ్వేడు పోలిగాడు.

"అదెలా కుదురుతుందిరా మూర్ఛరాందే... ఎట్టా పడిపోతాం?" అన్నాడు చీనయ్య.

"ఏటీ.... అది మూర్ఛేనంటావేంటి?"

పగలబడి నవ్వేడు పోలిగాడు.

ఒప్పించడానికి చీనయ్య ప్రయత్నించేడు. కాని ఒప్పుకోలేదు పోలిగాడు.

పోలిగాడు మనసులో లేచిన మంట సన్నగా రాజుకుంటున్నప్పుడు, చీనయ్య జబ్బుబడ్డాడు. అసలే అది మండువేసవి. జనం ఇల్లువదిలి రావటంలేదు ఆకలి పేగుల్ని తొలిచేస్తుంటే గత్యంతరం లేక ఒకపని చేశాడు పోలిగాడు.

నాలుగు రోజులుగా మూల్గుతూనే ఉన్నాడు చీనయ్య. పడుకుంటే గుచ్చుకుంటోందని బిళ్ళ తీసి ముసుగేసుకుని మూలుగుతున్నాడు.

మూర్ఛబిళ్ళ చంకనేసుకుని జారుకున్నాడు పోలిగాడు. తన మామూలుగా అడుక్కునే వీధులు వదిలేసి మెయిన్ బజార్ కొచ్చి విరుచుకుని పడిపోయేడు.

పావుగంట మండు వేసంగిలో పెనంలా కాలిపోతున్న సిమ్మెంట్ రోడ్డు మీద పడుకుని గిలగిల

లాడిన.... పోలిగాడి శ్రమ ఊరికే పోలేదు.

పోగయిన అయిదున్నర చిల్లర వాడి కళ్ళకు లక్ష రూపాయల మూటలా తోచింది. మూర్ఛబిళ్ళ కామధేనువులా కన్పించింది.

"నువ్వుచేసిన పనేం బాగో లేదు" గయ్‌మని లేచేడు చీనయ్య.

"నే నా పని సేసేనుగనకే ఈ యేళయినా.... నీకు, సెల్లాయికి వన్నం పొట్లం తెచ్చేను" కొట్టి పారేశాడు పోలిగాడు.

అక్కడితో ఇద్దరి మధ్య గొడవ బయల్దేరింది. మాటలు ఆగి పోయేయి. అన్నా, చెల్లి వాళ్ళ మానాన వాళ్ళు బ్రతుకుతున్నారు.

వేణ్ణీళ్ళకు.... చన్నీళ్ళలా సాగిన పోలిగాడి జీవితానికి చన్నీళ్ళే మిగి లేయి.

చీనయ్య లేచి కూర్చున్నాడు. తలలోంచి ధారగా నీళ్ళు కారు తున్నాయి. మనిషి వణుకుతున్నాడు.

ఎక్కడినించో పరుగెత్తు కొచ్చింది మంగి. "ఏంట్రా! మళ్ళీ పడిపోనావా... ఈ మద్దెల మరీ ఎక్కువగా పడతన్నావు. జబ్బు తిరగబెట్టిందో ఏటో" అందామె.

చెట్టుక్రింద నున్న పోలిగాడు పళ్ళు పటపటా కొరుకున్నాడు. 'లంజ ఏసికాలు' గొణుక్కున్నాడు.

మర్నాడు మధ్యాహ్నంవేళ.... నూకాలు తల్లి అరుగుమీద కూర్చుని ఉన్నాడు పోలిగాడు.

మధ్యాహ్నంవేళ కనక అక్కడ మిగిలిన బీదా బిక్కీ లేరు.

అరుగు చివరగా చీనయ్య మాత్రం కూర్చుని డబ్బులు లెక్క చూసుకుంటున్నాడు.

అతన్ని, అతని డబ్బుల్ని కసిగా చూస్తూ నానుడు రొచ్చె నముల్తున్నాడు పోలిగాడు.

అకస్మాత్తుగా అరుగు మీంచి పడిపోయి గిలగిలలాడటం మొద లెట్టాడు చీనయ్య.

కాళ్ళు చేతులు తపతపా కొట్టు కుంటూ గిలగిల లాడేడు చీనయ్య. వాడి చేతిలో చిల్లర చెల్లా చెదురుగా పడి ఉంది.

'దొంగ ఏసాలు సూద్దాం' పిల్లరంతా ఏరుకుంటూ అను కున్నాడు పోలిగాడు.

పది నిముషాలు గడిచింది. పావుగంట గడిచింది. ఎగఊపిరి, దిగఊపిరిగా వుంది చీనయ్య పరిస్థితి. 'తను కొండ దిగి వత్తా దని ఈడి ఎత్తు' చిల్లర చేత్తో పట్టుకుని గలగల లాడిస్తూ అను

కున్నాడు పోలిగాడు.

అరుగెక్కి రొట్టె తినటం మొదలెట్టేడు. మూలుగు ఆగిపోయి నట్లనిపించింది. లేచివచ్చి చూశాడు. కట్టెబొమ్మలా బిర్రబిగుసుకుని పడి ఉన్నాడు చీనయ్య. మెళ్ళో ఉన్న మూర్ఛ బిళ్ళ ఎండలో తళతళా మెరుస్తోంది.

"ఓరి చీనయ్యో!" దుఃఖం పొర్లుకొస్తుంటే కూలబడిపోయేడు- చీనయ్య దేహంముందు పోలిగాడు.

మరో గంటకు అంతా పోగ య్యేరు. మంగి వచ్చి గుండెలమీద తపతపా కొట్టుకుంటూ ఏడ్చింది, బావురుమంది.

చీనయ్య శవాన్ని లేపేసిన రాత్రి మంగి పోలిగాడి దగ్గర కొచ్చి, "ఇదిగో అన్నా! ఆడి బిళ్ళ, బిళ్ళే కాదు. ఈయేళ ప్రొద్దుటేలే ఇన్నేళ్ళుగా ఆడు దాచిన సిల్లరమూట నా సేతికిచ్చి, 'నాకేటయినా అయితే పోలిగాడి కియ్యవే! ఆడే నీ అన్న అనుకోవే' అన్నాడురా....." గొల్లుమంది.

పోలిగాడు వెక్కి వెక్కి ఏడ్చేడు. తలగోడకేసి కొట్టుకుని ఏడ్చేడు. మంగి చేయి పుచ్చుకుని సాయంత్రం చీనయ్యను పూడ్చిన జాగాకి నడిచేడు. చిన్న గొయ్యి వేసి మూర్ఛబిళ్ళ పూడ్చి పెట్టేసి, "నువ్వు నా సెల్లాయివే!" అన్నాడు మంగితో.


బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!
స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి

లోధ్ర

75 సంవత్సరములకు పైగా
సుఖజీవనమునకు
లోధ్ర టానిక్‌ను
వాడిన స్త్రీలు ఎందరో!

ఉచిత వైద్య సలహాకు
ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు
ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.

పేరు: ______________________

విలాసము: ______________________

______________ PIN ______________




కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు-14
ఏజంట్లు: శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికింద్రాబాద్ —